క్లుప్తంగా

కరప-అరట్లకట్ట రహదారి పరిశీలన



గొడ్డటిపాలెంలో రోడ్డుపై ప్రవహిస్తున్న నీటిని పరిశీలిస్తున్న అధికారులు, సర్పంచ్

కరప: కరప-అరట్లకట్ట రోడ్డు ఆధునీకరణ పనులను బుధవారం ఆ శాఖాధికారులు పరిశీలించారు. గొడ్డటిపాలెం గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలో రోడ్డుపై నుంచి వర్షం, మురికినీరు ప్రవహిస్తుండటంతో గ్రామస్తులకు ఇబ్బందికరంగా ఉంటోందని, గ్రామంలో సీసీ డ్రెయిన్లు నిర్మించేటప్పుడు నీరుపోయేలా తూములు ఏర్పాటుచేయాలని సర్పంచ్ వాసంశెట్టి శ్రీనుబాబు అధికారులను కోరారు. తగిన చర్యలు తీసుకుంటామని ఈఈ పి.రమేష్‌కుమార్ తెలిపి, గ్రామంలో రోడ్డుకు ఇరువైపుల సీసీ డ్రెయిన్లు నిర్మించనున్నట్టు తెలిపారు. డీఈఈ డీవీఎస్ వర్మ, ఏఈఈ కె.సాయి బాబా తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామక ఉత్తర్వుల అందజేత



కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు బుధవారం ఆయన కార్యాలయంలో కారుణ్య నియామకం పత్రం అందించారు. దేవీపట్నం మండలం గొందురు గ్రామంలో కురుపల్లి గోపి ఎస్‌జీటీగా పని చేస్తూ అనారోగ్యంతో మరణించగా ఆయన భార్య టీవీ రామలక్ష్మిని దేవీపట్నం మండల ప్రజాపరిషత్‌లో ఆఫీసు సబార్డినేట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. జెడ్పీ సీఈఓ ఎ.రమణారెడ్డి, ఏపీ పంచాయతీరాజ్ మంత్రిత్వ సిబ్బంది సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్‌వీవీ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ: వార్షిక మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సాంబమూర్తి నగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ జి.ప్రసాద్ ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని రెవెన్యూ కాలనీ, డాల్ఫిన్ కాలనీ, జ్యోతుల కాలనీ, సాంబమూర్తి నగర్ ఒకటి నుంచి ఐదో వీధి, మున్సిపల్ ఉద్యోగుల కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఈ అసౌకర్యానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

బాలాజీచెరువు: రెడ్ కాన్వెంట్ చారిటబుల్ ట్రస్ట్ పూర్వ విద్యార్థులు (1978) ద్వారా నలుగురు విద్యార్థులకు గురువారం సైకిళ్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ కోశాధికారి కళ్యాణి చేతుల మీదుగా పంపిణీ చేశారు. పాఠశాలలకు తమ ఇళ్లు దూరంగా ఉన్నాయనే కారణంతో తమ ట్రస్ట్‌ను సంప్రదించగా సైకిళ్లు అందజేసామని కళ్యాణి తెలిపారు. సృజన హాస్పిటల్ అధినేత సత్యవతి, బాదం కుసుమ, బి.నాగవేణి, పి.సుజాత, సీమకుర్తి రత్నశ్రీ పాల్గొన్నారు.

బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్చాలి



మాధవపట్నంలో బడిబయట పిల్లలను పాఠశాలలో చేర్చుతున్న డీఈఓ తదితరులు

సామర్లకోట: బడి వయసు ఉన్న పిల్లలను సమీప పాఠశాలల్లో చేర్పాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.అన్నపూర్ణ అన్నారు. విద్యార్థుల స్థూల నమోదు సందర్భంగా బుధవారం మాదవపట్నం గ్రామంలో ఆమె పర్యటించారు. గ్రామంలో ఐదు నుంచి 18 ఏళ్లు కలిగిన పిల్లల వివరాలను సేకరించారు. బడిబయట ఉన్న పిల్లలను ఆయా పాఠశాలల్లో చేర్పించాలని ఆమె సూచించారు. ఈ మేరకు పాఠశాలల హెచ్‌ఎంలు, గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు బడిబయట గుర్తించిన పిల్లలను విద్యాశాఖాధికారి సమక్షంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో చేర్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థూల నమోదు సర్వేను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య, హెచ్‌ఎం గోవిందరాజులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు రెడ్ అలర్ట్

- నగర పరిధిలో మూడు జోన్లుగా విభజన
- ప్రాంతం, సమయం ప్రాతిపదికగా విక్రయాలకు అనుమతి
- కమిషనర్ మహేష్ కుమార్ వెల్లడి



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ మహేష్‌కుమార్

కాకినాడ సిటీ: నగరంలో పలు ప్రాంతాల్లో గ్రీన్‌జోన్, యాంబర్ జోన్, రెడ్ జోన్‌గా విభజించిన వీధుల్లో తీసుకోవాల్సిన చర్యలపై నగరపాలక సంస్థ కమిషనర్ మహేష్‌కుమార్ బుధవారం టౌన్ ప్లానింగ్, ట్రాఫిక్, మెప్మా సిబ్బంది, స్ట్రీట్ వెండింగ్ సభ్యులతో సమీక్షించారు. ఈ జోన్లలో తీసుకోవల్సిన చర్యలపై కమిషనర్ మాట్లాడుతూ వీధి వ్యాపారులను నిర్దేశించిన జోన్లలో మాత్రమే అనుమతిస్తామని స్పష్టం చేశారు. రద్దీగా ఉండే రెడ్ జోన్లకు అనుమతించబోమని, యాంబర్ జోన్లలో నిర్దేశించిన సమయం, తేదీలలో మాత్రమే వ్యాపారాలు చేసుకోవచ్చునని తెలిపారు. ఇక గ్రీన్ జోన్లుగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో వ్యాపారాలు సాగించేందుకు ఎటువంటి ఇబ్బంది లేదన్నారు. ఆయా జోన్లను నిర్ధారించేందుకు అధికారులు, ఇతర వర్గాలతో కమిటీలు వేస్తామన్నారు. ఆయా జోన్ల వద్ద అవసరమైన మేరకు నగరపాలక సంస్థ ద్వారా సదుపాయాలు కూడా కల్పిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సీహెచ్ నరసింహారావు, కేఎంసీ ఎస్ఈ సత్యకుమారి, అధికారులు కె.హరిదాసు, కేవీ నాగశాస్త్రులు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, ట్రాఫిక్ డీఎస్పీ వెంకటేశ్వర, ట్రాఫిక్ సీఐ కృష్ణచైతన్య, టీపీఆర్‌వో మానే కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రూట్‌ఫుల్ స్కూల్స్

- ప్రభుత్వ పాఠశాలల్లో సంపూర్ణ పోషణ యోజన అమలు
- పాఠశాలల ఆవరణలోనే పండ్ల మొక్కల పెంపకం
- కమిషనర్ మహేష్ కుమార్ వెల్లడి

కాకినాడ: పాఠశాలల ఆవరణలోనే పిల్లలకు పోషక విలువలతో కూడిన పండ్లను ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల చెప్పారు. ఇందులో భాగంగా సంపూర్ణ పోషణ యోజన పేరిట అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పండ్ల మొక్కలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆగస్టు ఒకటో తేదీ నుంచి పండ్లను పెంచే కార్యక్రమానికి శ్రీకారం చుడతామన్నారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో బుధవారం ఈ అంశంపై కార్పొరేషన్, విద్యాశాఖ, ఉద్యానవన శాఖ, రోటరీ క్లబ్, కెఎస్‌పిఎల్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఎఫ్ఎన్‌జీ-ఎస్‌పీవై (ఫిల్ ద న్యూట్రిషన్ గ్యాప్ - సంపూర్ణ పోషణ యోజన) పేరిట 15 రకాల పండ్ల మొక్కలను ఆయా పాఠశాలల ఆవరణలో పెంచుతామన్నారు. వీటివల్ల పిల్లలకి ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు లభిస్తాయన్నారు. నాలుగు నెలల వ్యవధిలోనే ఎదిగే మొక్కలను నాటేందుకు వీలుగా అవసరమైన ప్రణాళికను సిద్ధం చేయాలని కమిషనర్ అధికారుల ఆదేశించారు. కాకినాడలోని సుమారు 90 పాఠశాలలకు రెండు విడతల్లో ఈ మొక్కల పెంపకం జరుగుతుందన్నారు. మొక్కలు ఎదిగి పండ్లు కాసిన తర్వాత వాటిని ఆ పాఠశాలలో చదువుతున్న పిల్లలు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు.

పెంచే మొక్కలు ఇవే

మామిడి, అరటి, పెద్ద రేగు, సీతాఫలం, జామ, యాపిల్, నిమ్మ, నేరేడు, బాదం, ఉసిరి, సపోటా, బొప్పాయి, పనస వంటి మొక్కలను నాటిస్తామన్నారు. స్వచ్ఛంద, కార్పొరేట్ సంస్థల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఒక్కో సంస్థకు 10 పాఠశాలలను కేటాయించనున్నట్లు తెలిపారు. మొక్కల సంరక్షణకు ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే ట్రీ గార్డ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి నాగమణి (ఇన్‌చార్జి), నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, డీసీపీ హరిదాసు, ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్, డీఈ మాధవి, ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ సిరిల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రేపు కాలక్షేప మండపం ప్రారంభం

బోట్‌క్లబ్: స్థానిక భానుగుడి వద్ద ఉన్న భానులింగేశ్వరస్వామి ఆలయంలో రూ.14 లక్షలతో నిర్మించిన కాలక్షేప మండపాన్ని శుక్రవారం ప్రారంభించనున్నట్లు ఆలయ ఈఓ ఎం మురళీ వీరభద్రరావు బుధవారం విలేకర్లకు తెలిపారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ఈ మండపాన్ని ప్రారంభిస్తారన్నారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

అమర జవాన్ల త్యాగం అమూల్యం



కొవ్వొత్తులు వెలిగించి కార్గిల్ అమర జవాన్లకు నివాళి అర్పిస్తున్న ఐడీఏ సభ్యులు



విశ్రాంత ఆర్మీ ఉద్యోగి శ్రీనగేష్‌ను సత్కరిస్తున్న ట్రస్ట్ సభ్యులు

- ఘనంగా కార్గిల్ దివస్
- కొవ్వొత్తులతో నివాళులు

బోట్‌క్లబ్: కార్గిల్ అమర జవాన్ల త్యాగం వెలకట్టలేనిదని ఇండియల్ డెంటల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించించారు. కొవ్వొత్తులు వెలిగించి జవాన్‌లకు నివాళి అర్పించారు. కార్గిల్ యుద్ధంలో పాకిస్థాన్ దళారీలను వారి ఆక్రమిత స్థానాలు నుంచి లడాఖ్ జిల్లాలోని 9 పర్వత శిఖరాలపై నుంచి తరిమి కొట్టినందుకు భారతదేశం సాధించిన విజయాన్ని గుర్తు చేసుకుంటూ ఈ రోజు జరుపుకొంటామన్నారు. కార్గిల్ యుద్ధవీరుల గౌరవార్థం ప్రతి సంవత్సరం జులై 26న కార్గిల్ దివస్ జరుపుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు వెదురుపాక సతీష్, సభ్యులు ఏఎస్ మూర్తి, చైతన్య, భవాని, కుమారి పాల్గొన్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్

కాకినాడ రూరల్: కార్గిల్ యుద్ధంలో పాకిస్థాన్‌పై మన దేశం సాధించిన విజయం చారిత్రాత్మకమని ఆర్మీ విశ్రాంత ఉద్యోగి ఎస్.శ్రీనగేష్ పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం కార్గిల్ విజయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అడబాల ట్రస్ట్ చైర్మన్ రత్న ప్రసాద్ తదితరులు శ్రీనగేష్‌ను సన్మానించారు. జూలై 26న మన భూ భాగాన్ని పాకిస్థాన్ నుంచి స్వాధీనం చేసుకోవడంతో అప్పటి నుంచి కార్గిల్ విజయ దినోత్సవం జరుపుకొంటున్నామన్నారు. చింతపల్లి సుబ్బారావు, రెడ్నం రాజా, సత్యనారాయణ పాల్గొన్నారు.

సర్కారీ పాఠశాలల్లో అత్యుత్తమ బోధన

సామర్లకోట: ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతిక నైపుణ్యంతో కూడిన విద్యను అందిస్తున్నట్టు మండల విద్యాశాఖాధికారి-2 పి.పుల్లయ్య అన్నారు. బుధవారం సాయంత్రం వేట్లపాలెం స్కూల్ కాంప్లెక్స్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో ప్రభుత్వం పానెల్ బోర్డులు, స్మార్ట్ టీవీలు అందిస్తోందని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యా రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు బలం చేకూర్చేలా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలన్నారు. తమ పిల్లలు ఇంగ్లిషులో మాట్లాడాలనే ఆశతో కాన్వెంట్లకు పంపుతున్నారని, ఒకటో తరగతి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఇంగ్లిషులో మాట్లాడేలా తయారు చేయడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. 10 తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించేలా ఇప్పటి నుంచి విద్యార్థులపై శ్రద్ధ చూపాలన్నారు. ఈ సందర్భంగా మేడపాడు, వేట్లపాలేనికి చెందిన ఉపాధ్యాయులు ఎంఈఓను సత్కరించారు. ఉపాధ్యాయ సంఘ నాయకులు, సీఆర్పీలు పాల్గొన్నారు.



ఎంఈఓ పుల్లయ్యను సత్కరించిన ఉపాధ్యాయులు

ఏటిగట్టు కోత



కోతకు గురవుతున్న వేములవాడ ఏటిగట్టురోడ్డు

- ఏ ప్రమాదం ముంచుకొచ్చేనో..
- ఆందోళన చెందుతున్న వాహన చోదకులు

కరప: తుల్యభాగ డ్రెయిన్ గట్టు రోడ్డు కోతకు గురవుతోంది. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రయాణికులు, వాహనచోదకులు ఆందోళనకు గురవుతున్నారు. ఐదారు మండలాల్లోని మురుగు, ముంపునీటిని సముద్రంలోకి తీసుకు వెళ్లే ఈ డ్రెయిన్ మండలంలో వేళంగి నుంచి ప్రారంభమై యండమూరు, వడ్డిపాలెం, పెదకొత్తూరు, వేములవాడ, కొంగోడు, గొర్రిపూడి మీదుగా తాళ్లరేవు మండలం పటవల వద్ద సముద్రంలో కలుస్తుంది. తుల్యభాగ ఏటిగట్టు రోడ్డు కరప, కాజులూరు, తాళ్లరేవు మండలాలను అనుసంధానం చేస్తుంది. వేములవాడ, వలసపాకల, వాకాడ, కరప తదితర గ్రామాలవారు ఈ రోడ్డుపై ప్రయాణించి ఆయా మండలాలకు, ద్రాక్షారామ, కోటిపల్లి పుణ్యక్షేత్రాలకు వెళ్తుంటారు. గొర్రిపూడి, కొంగోడు, పెద్దాపురప్పాడు తదితర గ్రామాల వారు మండల కేంద్రానికి వెళ్లేందుకు ఈ రోడ్డు వెంబడి రాకపోకలు సాగిస్తుంటారు. ఏటా వర్షాకాలంలో కురిసే వర్షాలకు, తుపాన్ల వల్ల వచ్చే వరదనీటి ప్రవాహానికి తుల్యభాగ డ్రెయిన్ గట్టు కొన్నిచోట్ల కోసుకుపోయినా, సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. తుల్యభాగ డ్రెయిన్ గట్టు వెంబడి వేములవాడ నుంచి గొర్రిపూడి వరకు ఉండే ఏటిగట్టు రోడ్డు ఒకచోట భారీగా కోతకు గురైంది. దీంతో రోడ్డుపై వెళ్లే వాహన చోదకులు ప్రమాదాల పాలవుతున్నారు. రాత్రి సమయం రోడ్డుకోత కనిపించక ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాల పాలవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తుల్యభాగ డ్రెయిన్ గట్టు పటిష్టపరచి, కోసుకుపోయిన రోడ్డును సరిచేయించాలని ప్రజలు కోరుతున్నారు.



ఏటిగట్టురోడ్డు కోతకు గురై అంచులో ఏర్పడిన గొయ్యి

ప్రమాదాలు జరుగుతున్నాయి



వేములవాడ ఏటిగట్టు రోడ్డుపై ప్రయాణం ప్రమాదభరితంగా తయారైంది. వేములవాడ, గొర్రిపూడి గ్రామాల మధ్య ఒకచోట చాలా ఎక్కువగా ఏటిగట్టు కోతకు గురైంది. ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించేటప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయి. కోతకు గురైన గట్టు పటిష్ట పరచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– గుత్తుల సత్తిబాబు, వేములవాడ శివారు సిరిగలవానిపల్లిలంక

ఏటిగట్టును పటిష్ట పరచాలి



మూడు మండలాలను కలిపే ఏటిగట్టు రోడ్డు చాలా చోట్ల కోతకు గురవుతోంది. ఈ వర్షాకాలంలో మరీ ఎక్కువగా కోతకు గురయ్యే అవకాశం ఉంది. రాత్రి సమయంలో పక్కకు వెళితే అదుపుతప్పి వాహన చోదకులు పడిపోతున్నారు. వేములవాడ ఏటిగట్టు రోడ్డు కోతకు గురైన ప్రాంతాలు గుర్తించి, గోతులు పూడ్చించేలా చర్యలు తీసుకోవాలి.

– ఊబా కిశోర్, గొర్రిపూడి

రూ.16 లక్షలతో ప్రతిపాదనలు

గత ఏడాది తుపాన్లకే ఈ ఏటిగట్టు కోసుకుపోయింది. గట్టు పటిష్టతకు రూ 16 లక్షలతో ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే ఏటిగట్టును పటిష్ట పరుస్తాం.

– కె.కీర్తి, ఏఈఈ, డ్రైన్ల శాఖ

మనుషుల్లో మానవత్వం... వలంటీర్లకు వందనం

అండగా ఉంటూ సేవలు



కూరాడాలో లబ్ధిదారుకు పింఛన్ ఇచ్చేందుకు వేలిముద్ర తీసుకుంటున్న వలంటీర్ వెంకటేష్

కూరాడ వలంటీర్ కాకి వెంకటేష్ తనకు కేటాయించిన కుటుంబాలవారికి అండగా ఉంటూ, సేవలందిస్తున్నారు. తన పరిధిలోని కొప్పిశెట్టి వీరవేణికి భర్తలేక పోయినా ఎక్కడికీ వెళ్లక్కర్లేకుండా ప్రభుత్వ పథకాలు వచ్చేలా చేశారు. వైఎస్సార్ పింఛన్ కానుక పథకంలో పింఛన్ రాయించి, ప్రతినెలా క్రమం తప్పకుండా ఉదయాన్నే ఇంటికి వెళ్లి పింఛన్ అందజేస్తున్నారు. దరఖాస్తు చేయించి, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా పథకాలు వచ్చేలా చేయడంతో పాడిగేదె కొనుక్కుని జీవనం సాగించేలా చేశారు. డ్వాక్రాలో సున్నా వడ్డీ వచ్చేలా చేశారు. వలంటీర్ వెంకటేష్ తన పరిధిలోని కుటుంబాల వారికి ఎప్పుడు, ఏ అవసరం వచ్చినా నేనున్నానంటూ సేవలందిస్తూ, అందరి మన్ననలు పొందుతున్నారు.

పాడిగేదె కొనేలా ప్రోత్సహించారు



వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా పథకాల గురించి చెప్పడమే కాకుండా కాగితాలపై సంతకాలు చేయించుకుని, బయటకు రాకుండా ఆ పథకాల ద్వారా రూ.61,500 వచ్చేలా చేయడంతో పాడిగేదె కొనుగోలు చేసి, ఎవరిపైనా ఆధారపడకుండా జీవించగలుగుతున్నాను. పింఛన్ ఇప్పించారు. ఇంతవరకూ పింఛన్ సొమ్ము రూ.64,250 వచ్చాయంటే మా వలంటీర్ వల్లే. మాలాంటి ఒంటరి మహిళలకే కాకుండా అన్ని వర్గాల వారికీ నిస్వార్థ సేవలందిస్తున్న వలంటీర్లను, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న పాలన ఎప్పటికీ మరువలేం.

– కొప్పిశెట్టి వీరవేణి, కూరాడ

కష్టంలోనూ తోడుగా



రామలక్ష్మి కుమారుడిని ఫిజియోథెరపీ కోసం తీసుకు వెళ్లేందుకు సహకరిస్తున్న వలంటీర్ గంగావతి

ప్రజల కష్టంలో కూడా నేనున్నానంటూ తోడుగా నిలవడం ద్వారా 12వ డివిజన్ హనుమాన్‌నగర్‌కి చెందిన వలంటీర్ గంగావతి స్థానికుల అభిమానాన్ని చూరగొంటున్నారు. పింఛన్ల పంపిణీ, పథకాల అమలుతో పాటు ప్రతి కుటుంబంతో మమేకమై ఆ ఇంటిలోని ఓ సభ్యురాలిగా మమేకమవుతున్నారు. భర్త మరణించి ఉన్న రామలక్ష్మి కుటుంబానికి అన్నీ తానై తోడుగా నిలిచారు. కాళ్లు చచ్చుబడి నడవలేని స్థితిలో ఉన్న ఆమె కుమారుడికి దగ్గరుండి మరీ ఫిజియోథెరపీ చేయిస్తున్నారు. రామలక్ష్మికి వితంతు పింఛను, ఆమె కుమారుడికి దివ్యాంగ పింఛన్, ఇళ్ల పట్టాను కూడా మంజూరు చేయించి ఆ కుటుంబానికి గంగావతి ఆసరాగా నిలిచారు.

సోదరిలా ఆదరణ



వలంటీర్ గంగావతి సొంత అక్కలా నన్ను ఆదరిస్తోంది. నా ప్రతి కష్టంలోనూ తోడుగా నిలుస్తోంది. మా పిల్లలకు ఆసరాగా నిలిచి, నాకు కూడా సహాయంగా నిలబడుతోంది. మా వలంటీర్ అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు.

– రామలక్ష్మి, లబ్ధిదారురాలు

పిల్లలను బడికి పంపించాలి



కరప హైస్కూలులో డ్రాపౌట్ విద్యార్థులను చేర్పించి, జేవీకే కిట్లను ఇస్తున్న ఎంఈఓ సత్యనారాయణ

కరప: తల్లిదండ్రులు తమ పిల్లలను పనిలోకి కాకుండా బడికి పంపించాలని ఎంఈఓ-2 ప్రత్తి సత్యనారాయణ సూచించారు. కరప గ్రామానికి చెందిన కాకర సత్యనారాయణ, పుట్టా సతీష్, పొన్నాడ నాగచైతన్యలు పాఠశాలకు రావడం లేదని గుర్తించి ఇన్‌చార్జి గ్రామ కార్యదర్శి ఎస్‌కే నాగేంద్రకుమార్, కేశవరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు సాదే లోహిదాస్‌కుమార్‌లతో కలసి ఎంఈఓ-2 సత్యనారాయణ డ్రాపవుట్ విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. కాన్వెంట్లతో సమానంగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దామని, అన్ని మౌలిక వసతులు కల్పించడం జరిగిందని, మధ్యాహ్న భోజన పథకం, ఉచితంగా పాఠ్య పుస్తకాలు, బ్యాగ్, బూట్లు, టై అందించడం జరుగుతోందని, అమ్మఒడి పథకంలో రూ.15 వేలు ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తోందని వివరించారు. విద్యార్థులను కరప హైస్కూలులో చేర్పించి, జగనన్న విద్యాకానుక కిట్లను అందజేశారు.

అరట్లకట్టలో జగనన్న సురక్ష



అరట్లకట్టలో లబ్ధిదారులకు ధ్రువీకరణపత్రాలు అందజేస్తున్న ఎంపీడీఓ, సర్పంచ్‌లు

కరప: మండలంలోని అరట్లకట్ట గ్రామ సచివాలయంలో బుధవారం జగనన్న సురక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.అప్పారావు పాల్గొని సచివాలయం పరిధిలోని అరట్లకట్ట, గొడ్డటిపాలెం గ్రామాలకు చెందిన 723 మంది లబ్ధిదారులకు కౌలుగుర్తింపు కార్డులు, ఆధార్‌సేవలు, కుల, నివాస, ఆదాయం వంటి 11 రకాల ధృవీకరణ పత్రాలను ప్రజాప్రతినిధులు, అధికారులు అందజేశారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు గోపి సత్యవేణి, వాసంశెట్టి వెంకటరమణ, డీటీ కె.అనిల్‌కుమార్, గ్రామ కార్యదర్శి వై.రాంజీ తదితరులు పాల్గొన్నారు.

సర్వే సమగ్రంగా నిర్వహించాలి : ఆర్డీఓ



కరపలో ఓటర్ల సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ సత్యనారాయణ

కరప: ఓటర్ల జాబితా ప్రకారం బీఎల్‌ఓలు ఇంటింటా సర్వే సమగ్రంగా నిర్వహించాలని ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ అన్నారు. కరపలో బుధవారం పర్యటించి, బీఎల్‌ఓలు నిర్వహిస్తున్న ఇంటింట సర్వేను పరిశీలించి పలు సూచనలిచ్చారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులుంటే ఓటర్లుగా నమోదుచేయాలన్నారు. ఎవరైనా గ్రామాంతరం వెళ్లినా, మరణించినా నిర్దేశించిన ఫార్మ్ ద్వారా ఓటర్ల జాబితాలో సరిచేయాలన్నారు. ఇంటి నంబరు ప్రకారం ఓటర్లు ఉన్నారో, లేదో పరిశీలించాలన్నారు. పేరులో కానీ, చిరునామాలో కానీ తప్పులున్నా సవరించాలని ఆయన సూచించారు. తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఆర్ఐ పేపకాయల మాచర్రావు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల సహకారం అవసరం



సామర్లకోటలో బీఎల్‌ఓలు చేస్తున్న సర్వేను తనిఖీ చేస్తున్న ఆర్డీఓ సీతారామారావు

సామర్లకోట: ఓటర్ల సర్వే పారదర్శకంగా ఉండాలని, దానికి ఓటర్ల సహకారం ఏంతో అవసరమని ఆర్డీఓ సీతారామారావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 128, 129, 130, 131, 132 పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో జరుగుతున్న ఓటర్ల సర్వేను ఆర్డీఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ప్రజల ఓటుకు ఎంతో విలువ ఉన్నదని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్లుగా నమోదు కావాలన్నారు. ఓకే ఇంటిలో 10 ఓట్లకు మించి ఉంటే వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతీ ఇంటికి వెళ్లి ఓటర్లను వివరాలు అడిగే సమయంలో ఓటరు లిస్టులో ఉన్న వారి పేరు చదివి వినిపించడంతో పాటు వారి ఫొటోను ఓటర్లకు చూపించాలన్నారు. ఓటర్లకు ఉన్న అభ్యంతరాలను నివృత్తి చేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, టీపీఓ ఫణికుమార్, సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

వడ్లమూరులో సర్వే పరిశీలన

పెద్దాపురం: డివిజన్‌లో జరుగుతున్న ఓటరు జాబితా రీ సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని ఆర్డీఓ రామారావు ఆదేశించారు. బుధవారం మండలంలోని వడ్లమూరులో జరుగుతున్న రీ సర్వేను ఆయన పరిశీలించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలపై ప్రజలు మరింత పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. ఓటరు జాబితాలపై అపోహలు ప్రజల్లో తొలగిపోవాలంటే వాటిపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులు, ప్రజా ప్రతినిధులపై ఉందన్నారు.